



''ఆ... పాప్ కార్న్... పాప్ కార్న్...'' పదేళ్ళ కుర్రాడు అరుస్తున్నాడు.

''మమ్మి పాప్‌కా.. పాప్‌కా కావాలి మమ్మీ'' నాలుగేళ్ళ మయూరి గొడవ చేస్తోంది.

''బాబు చిల్లర లేదు గాని... నువ్విక్కడే వుండి అరుస్తుంటే పాప మరింత ఏడుస్తుంది.

కాస్త అటు ప్రక్కకి వెళ్ళి అమ్ముకో బాబు...'' బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నది.

''నా దగ్గర చిల్లరుందమ్మ. ఎంత కావాలో చెప్పండి ఇస్తాను'' అన్నాడు వాడు.

తబ్బిబ్బు పడింది శైవల్లి... మూడు రోజులైంది తిరుపతికి వచ్చి. ఇప్పుడు తిరుగు ప్రయాణం. క్రింది తిరుపతికి వెళ్ళడానికి టిక్కెట్ల కోసం క్యూలో నించున్నాడామె భర్త. వెళ్ళి కూడా గంటైంది. ఐదేళ్ళ ఫణీంద్ర బూరల కోసం, మౌతార్గాన్ కోసం వుండుండి నస పెడుతున్నాడు. పాప పల్లవి పాప్‌కార్న్ కావాలని మారాం చేస్తోంది. డబ్బులు మొత్తం ఎప్పుడూ ఆయన చేతుల్లోనే వుంటాయి. ఆమెకెంత కావాలో అంత అతన్నడిగి తీసుకోవాల్సిందే.

''ఏమ్మా... ఓ ప్యాకెట్ ఇచ్చేదా...'' పాప్ కార్న్ అమ్మే కుర్రాడు అడుగుతున్నాడు.

''డబ్బులు అయ్యగారి దగ్గరున్నాయి... ఆయనేమో క్యూలో వున్నారు. నువ్వెళ్ళు బాబు'' వివరణ ఇచ్చుకుంది.

''మరట్లా చెప్పావు గదమ్మా, చిల్లర లేదంటే పోని నా దగ్గరున్నాయి, ఇద్దామనుకున్నాను'' పెద్దగా ఇకిలిస్తూ అన్నాడు వాడు. శైవల్లి ముఖం చిన్నబుచ్చుకుని చుట్టూ చూసింది. ఒకరిద్దరు ఇటే కుతూహలంగా చూస్తున్నారు. ఇలా జరగడమామెకు మొదటి సారి కాదు. తన కోసం ఏదన్నా కొనుక్కోవాలన్నా అతనిష్టపడి ఇస్తేనే కొనుక్కోవడం.

ఉండుండి ఫణీంద్ర ''మౌతార్గాన్ కావాలి'' అని నసుగుతున్నాడు. పాప అటూ, ఇటూ పరుగులు పెడ్తూ కూల్ డ్రింక్‌ల వాడి వెంట, పూలబుట్టల వాళ్ళ వెంట పడ్తూ అవి కావాలని మారం చేస్తుంటే పాపని భయపెడ్తూ, నచ్చచెబ్తూ తెచ్చి పక్కన కూర్చోబెట్టుకుంటున్నది. మళ్ళీ ఏదో ఒక సందు చూసుకుని పాప పరుగు పెడ్తుంది. తన దగ్గర డబ్బులు వుంటే పిల్లలు అడిగినవన్నీ కొనిచ్చేదని కాదు. వాళ్ళు అడిగిన పది కోర్కెల్లో తనకు సబబనిపించింది ఒక్కటైనా తీర్చి మిగతా వాటి విషయంలో నచ్చచెప్పేది. ఏది అడిగినా ఒక్కటీ కొనివ్వని అమ్మను చూసి మండి పడ్తున్నారు పిల్లలిద్దరు.

అంతలో బుట్టనిండా గ్రీన్ గులాబి పువ్వులు పెట్టుకుని పూలు... పూలు అంటూ వచ్చాడో కుర్రాడు. అవి చూసి పాప-

''పూలు... పూలు'' అంటూ చిన్నగా రాగం మొదలుపెట్టి గట్టిగా ఏందులువేయడం మొదలు పెట్టింది.

చుట్టుపక్కల అందరూ ఇటే చూడడమే కాదు.. 'పసిపిల్ల అడుగుతోంది. పోనీ పువ్వే గదమ్మా కొనియ్యకపోయావా?' అని సలహాలిస్తున్నారు. శైవల్లీ పాపను సముదాయించలేక ఒక్కటంటించింది.

అంతలోనే పాపని కొట్టినందుకు బాధపడ్తూ ఈయన తొందరగా వస్తే బాగుండు. ఏం మనిషి... పెళ్ళాం చేతిలో ఐదు రూపాయి




* వనితాజ్యోతి, జూన్ 1990 *

లుంచాలంటే ప్రాణం వప్పదు. పిల్లలకేం తెల్సి విషయాలన్నీ... ఒకటే అల్లరి చేస్తున్నారు... చిరాకు, బాధ మేళవిస్తున్నాయామెలో.

ఓ పది నిముషాల్లో పురుషోత్తమ్ వచ్చాడు టిక్కెట్లతో. అప్పటికే నాలుగైదు బస్సులు వెళ్ళిపోయాయి. ఏడుస్తున్న పాపను సమీపించి-

"ఎందుకేడుస్తున్నావమ్మా పాప.." పాపని ఎత్తుకుంటూ అడిగాడు.

"పాప్‌కార్న్ కావాలట... పువ్వులు కావాలని, బిస్కెట్లు కావాలని ఒకటేమిటి చూసిందల్లా కావాలని ఒకటే ఏడుపు... బాబుకేమో మౌతార్గాన్ కావాలట. మీరేమో నా చేతుల్లో పది రూపాయిలు కూడా వుంచరు..." నిష్ఠూరంగా అన్నది శైవల్లి ఆ మాటలు వినిపించుకోనట్టే.

"ఏమ్మా పల్లవీ... పువ్వులు కావాలా... ఏ అబ్బీ ఇటురా..." అంటూ పిలిచి రెండు గులాబి పువ్వులు కొన్నాడు. రెండు పాప్‌కార్న్ ప్యాకెట్స్ కొని పాపకొకటి, బాబుకొకటి ఇచ్చాడు.

"ఒక పువ్వు మమ్మీకియ్యమ్మా..." అన్నాడు.

"నేనివ్వను..." గట్టిగా చెప్పింది పాప.

"ఎందుకమ్మా..." పురుషోత్తమ్ అడిగాడు.

"మమ్మీ బాడ్.. నాకు పాప్‌కా.. పూలు... బిక్కెట్ ఏమీ ఇవ్వలేదు" చెప్పింది పాప ముద్దుగా. పెద్ద జోక్ విన్నట్లుగా పగలబడి నవ్వాడు పురుషోత్తమ్. శైవల్లి మనసు చివుక్కుమంది. పాప పువ్వు ఇవ్వనందుకు కాదు. పిల్లలిద్దరి దృష్టిలో తాను పలుచబడ్తున్నందుకు.

*   *   *

"నమస్తే మాజీ... మై హూ గుర్ఖావాలా..."

"ఏం కావాలి...?"

"పైసలు... జీతం" అన్నాడు.

జీతమంటే ఎంతో కాదు. రాత్రుళ్ళు కాలనీ కాపలా కాస్తున్నందుకు ఇంటికి ఐదు రూపాయిలు. లోపలికి వెళ్ళి పురుషోత్తమ్ బ్యాగ్ వెతికింది. డబ్బులు లేవు. తన పర్స్ వెదికింది వుండవని తెల్సి...

"చిల్లర లేవు బాబు. రేపురా..." తన దగ్గర కనీసం ఐదు రూపాయిలు కూడా లేనందుకు

ఇది నిజం

అప్పుడే గుడ్డులోంచి బయటకు వచ్చిన మొసలి పిల్ల తన గుడ్డుకన్నా మూడు రెట్లు పెద్దదిగా వుంటుంది.

కించపడుతూ చెప్పింది.

మర్నాడు కూడా పురుషోత్తమ్ ఆఫీసుకు వెళ్ళాకే వచ్చాడు.

"అయ్యొయ్యొ ఆయన్నడగడం మరచిపోయాను... రేపురా తప్పక ఇస్తాను" అన్నది. నిజానికి శైవల్లి కాదు మరచిపోయింది. రేపొద్దున్న ఇస్తానులే అని చెప్పి ఇవ్వడం మరచి వెళ్ళాడు పురుషోత్తమ్. రాత్రి భోజనాలప్పుడు మళ్ళీ అడిగింది. "ఇవ్వచ్చులే" అన్నాడు. ఇవ్వలేదు. తెల్లవారాక గూర్ఖా మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

"పాంచ్ రూపాయ కోసం పది సార్లు తిప్పతారేమమ్మా..." అన్నాడు.

శైవల్లి మనసు ముడుచుకుపోయిందా మాటకు. ప్రక్కింటావిడ దగ్గర అడిగి తీసుకుని ఇచ్చింది. తనకు సంపాదించుకోగల శక్తి వుండి కూడా అన్ని ఆర్థికావసరాలకు అతనిపై ఆధారపడి అందరితో అవమానింపబడడం - మరోసారి చాలా బాధపడింది శైవల్లి.

*   *   *

బయట ఏదో చప్పుల మోత వినిపించడంతో పని ముగించుకుని అప్పుడే ఓ కునుకు తీస్తున్న శైవల్లికి మెలకువ వచ్చింది. ఇంతలో తలుపు మీద టక్ టక్ మని చప్పుడైంది. వెళ్ళి తలుపు తీసింది.

"అమ్మా అనాధాశ్రమం నుండి వచ్చాం. మీకు తోచిన సాయం చెయ్యండి" అన్నాడో పన్నెండు, పదమూడేళ్ళ కుర్రాడు.

"నా దగ్గరిపుడు డబ్బులు లేవు బాబు. మరోసారి రా.." తల దించుకుని చెప్పింది శైవల్లి.

"ఎందుకమ్మా అట్లా చెప్తారు... మీరు చదువుకున్న వారిలా వున్నారు. మాలాంటి అనాధలకి ఓ రూపాయి సాయం చేస్తే

ఇది నిజం

ఇంగ్లాండ్‌లోని యార్క్‌షైర్‌కు చెందిన థామస్ వెడ్డర్స్ ముక్కు పొడవు 50.25 సెం.మీ. ఇది ప్రపంచంలో పొడవాటి ముక్కు.

ఏమమ్మా... చదువుకునే పిల్లలమమ్మా... మీ పిల్లలకి అవసరమొచ్చినా అన్నింటికి మీరున్నారమ్మా... మాకే ఆపద వచ్చినా ఎవరున్నారమ్మా... మీ లాంటి తల్లులే దయ తల్చాలి"

ఆ బాబు అలా చెబుతుంటే ఆ బాబు కేమి సహాయం చెయ్యలేని తన స్థితిని తనకే కన్నీళ్ళొచ్చాయి. తన భర్త గెజిటెడ్ ఆఫీసర్. భార్య ఉద్యోగం చెయ్యడం ఇష్టం లేని సగటు మొగాడు. ఆడవాళ్ళ చేతిలో పది రూపాయిలు పెట్టడానికి పాతిక కారణాలడిగే మొగవాళ్ళలో ప్రథముడు. ఈ బాబుకి ఏం చెప్పి సమాధానపర్చాలి.

"బాబు... సార్ ఆఫీస్‌కి వెళ్ళారు. నా దగ్గర నిజంగా డబ్బులులేవు... వుండు ఇప్పుడే వస్తా..." అంటూ లోనికి వెళ్ళి... ఫణీంద్ర కోసం కొన్న రెండు కొత్త నోట్‌బుక్స్ తెచ్చిచ్చి "ఇవి నీ కేమన్నా అవసరమైతే వాడుకో" అని ఇచ్చింది. ఆ బాబు సంతోషంగా తీసుకున్నాడు. ఆ బాబుకి ఏదో ఒకటి ఇవ్వగలిగినందుకామెకు తృప్తిగా అనిపించింది.

పెళ్ళైన కొత్తలో "ఏమండీ... ఇక్కడ జూనియర్ కాలేజీలో లెక్చరర్ పోస్ట్ ఖాళీగా వుందట... అప్లై చేద్దామనుకుంటున్నాను" అని చెప్పింది.

"నో... నో నథింగ్ డూయింగ్... ఆడవాళ్ళెంతో సుకుమారులు... ఇంట్లో పనితోనే అలసి పోతారు. మళ్ళీ ఉద్యోగాలు అవీ చేసి ఇంటా బయటా ఎందుకు శ్రమ. అదీ కాక ఇంటికి రాగానే నువ్వు కనిపించకపోతే నాకు పిచ్చెక్కిపోతుంది సుమా..." ఆమెను దగ్గరకు తీసుకుని చెప్పగానే కరిగిపోయింది.

ఓ ఆర్నెల్లు గడిచాక మళ్ళీ అడిగింది.

"ఏమండి, ఎం.ఎ. చదివి ఊరికే ఇలా ఇంట్లో కూర్చోవడం నాకేం నచ్చడం లేదు. నేనూ ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోతాను..."

"ఇదిగో శైవల్లీ ఇంకోసారి ఉద్యోగం ప్రసక్తి తేకు నా దగ్గర. ఇంతవరకూ మా ఇళ్ళలో ఆడవాళ్ళెవ్వరూ ఉద్యోగాలంటూ బయటకు వెళ్ళి పది మంది మగాళ్ళ మధ్యన కూర్చుని ఉద్యోగాలు వెలగబెట్టలేదు. నీకూ ఆ అవసరం లేదు" ఖచ్చితంగా చెప్పేసిన అతడ్ని చూసి నివ్వెరబోయింది. ఆడది ఉద్యోగం చేయడం అతని దృష్టిలో ఎంతో హీనమని గుర్తించి అమితంగా బాధపడింది. ఒకటి రెండుసార్లు తీవ్రంగా ఎదురించి పోట్లాడింది. అతను

పిల్లేదు అనే అన్నాడు.

"అలాంటప్పుడు ఎం.ఎ. చదివిన నన్నెందుకు చేసుకున్నారని" నిలదీసింది. ఇంత చదువు వ్యర్థం కాదా అని బాధపడింది.

"ఇంటి దగ్గర నీ పిల్లల్ని సరిగ్గా చదివించుకో చాలు..." అన్నాడు వెక్కిరింపుగా. అతని మాటల ధోరణికి విసిగిపోయి... అతనితో వాదించి లాభం లేదని తెల్సుకుని మౌనంగా ఊరుకుంది. అతన్ని ఎదిరించి ఏ పని చేసే ధైర్యం లేకపోయింది. భార్య ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోయినా కనీసం తెచ్చుకున్న జీతం ఇద్దరూ కలిసి చర్చించుకుని ఓ పద్ధతి ప్రకారం ఇద్దరూ ఖర్చు చేసుకున్నా కొంత నయం. ఆ పద్ధతీ లేదు. ఆమెకేం ఖర్చులుంటాయని అతని ఉద్దేశం. ఆ అవసరమేదో వచ్చాక అతనికి చెప్తేనే ఇస్తాడు. నెల మొత్తం మీద ఆమె చేతికిచ్చేది పదో, ఇరవయ్యో... ఎంత కాలమిలా... బాధగా ఆలోచిస్తూ... కలత నిదుర పోయింది శైవల్లి.

* * *

అమ్మా... అమ్మా... చెల్లి పడిపోయింది. రక్తమొస్తుంది... ఫణీంద్ర కంగారుగా అరిచి చెప్పేసరికి చేస్తున్న పనాపి ఒక్క పరుగున పాపను చేరుకుంది. బోర్లా పడ్డదేమో పళ్ళు కరుచుకుపోయి నోరంతా రక్తం. మోచేతికి రాయి తగిలినట్లుంది. లోతుగా గాయమైంది. పాపనా స్థితిలో చూసి ఆందోళన పడిపోయింది. గాయాలు కడిగి పాపను భుజాన వేసుకుని బాబును ప్రక్కింట్లో ఆడుకొమ్మని చెప్పి దగ్గర్లో వున్న క్లినిక్‌కి బయలు దేరింది.

ప్రక్కింటామెను "ఓ ఇరవై రూపాయిలుంటే ఇవ్వండి. వారు రాగానే ఇచ్చేస్తాను" అన్నది.

"అయ్యయ్యో! ఇందాకే యాభై నోటుంటే పనుందని ఆయన తీసుకెళ్ళిపోయారు" అన్నది. ఏమైతే అదైందని డాక్టరు దగ్గరకు బయలు దేరింది ఉత్త చేతులతో.

డాక్టర్ గాయాలకు మందు రాసి ఇంజక్షన్ చేశాడు. అప్పుడు చెప్పింది శైవల్లి.

"డాక్టర్! పాప పడిపోయిందన్న కంగారులో పర్స్ మర్చిపోయి వచ్చాను. ఈ ప్రక్క సందులోనే మా ఇల్లు. రేపు తప్పకుండా వచ్చి మీ ఫీజిస్తాను" అబద్ధం చెబుతున్నందుకు, చెప్పాల్సిన తన పరిస్థితికి సిగ్గిల్లిపోతూ చెప్పింది.

"ఇట్సాల్‌రైట్..." అంటూ మందులు రాసిచ్చాడు.

"ఆ రాత్రి... గెజిటెడ్ ఆఫీసర్ పురుషోత్తమ్‌తో శైవల్లి ఎం.ఎ. చాలా పెద్ద గొడవే పెట్టుకుందామనుకుంది. కాని మౌనంగా ఊరుకుంది. ఏదో ఆలోచిస్తూ పడుకుంది.

* * *

మర్నాడు ఉదయం బాబుని క్లాస్‌కి పంపి వాళ్ళ హెడ్‌మిస్ట్రెస్‌ని కల్సుకుంది. "మేడం మీరిది వరకు మీ స్కూల్లో వర్క్ చెయ్యమని అడిగారు. అప్పుడు మా పాప చాలా చిన్నది. ఇప్పుడు పాపకి మూడేళ్ళు నిండాయి. పాపని స్కూల్లో చేర్పించి నేను కూడా జాబ్ చేద్దామనుకుంటున్నాను. మీ స్కూల్లో పోస్టేదైనా ఖాళీగా వుంటే... " అన్నది.

"దట్స్ గుడ్. లేట్‌గానైనా ఓ మంచి డెసిషన్ తీసుకున్నారు. జాబ్ ఇస్తాను. కాని మీ ఎం.ఎ. చదువుకు సరిపడ సాలరీ ఇవ్వలేను. నాలుగు వందలు ఇస్తాను ఇష్టమేనా" అడిగిందామె.

ఇష్టమే అన్నట్లుగా తల ఊపింది.

తన అస్తిత్వాన్ని కోల్పోయి ఆరేళ్ళు ఏమి సంపాదించకుండానే గడిపింది. తనను తాను దిద్దుకుంటున్న ఈ సమయంలో ఆ నాలుగు వందల రూపాయి కాయితాల్లాకాక ఆమెను ఆమెగా నిలిపే వరాల్లా అనిపించాయామెకు.

ఆ రోజు డ్యూటీ చేసి పిల్లలను తీసుకుని ఇంటికి వెళ్తుంటే పురుషోత్తమ్ బాగా పోట్లాడ్తాడేమోనని బెరకుగా అనిపించిందో క్షణం. మరు క్షణం ఓ నిశ్చయానికి వచ్చినదానిలా... స్థిరంగా వడి వడిగా ధైర్యంగా నడవసాగిందామె.




* కరాచీ నూక పురుగు పట్టకుండా నిల్వ వుండాలంటే దోరగా వేపుకుని డబ్బాలో వుంచుకోవాలి.

* దోసకాయ కొద్దిగా ముగ్గితే దాన్ని పారేయకుండా చక్రాల్లా సన్నగా తరుక్కుని ఎండలో గలగలా ఎండనిచ్చి, వడియాల్లా నూనెలో వేపుకుని, ఉప్పు, కారం చల్లుకుని తింటే బాగుంటాయి.

* బెండకాయ పులుసు నీటిని వార్చినట్టయితే, వార్చిన పులుసు పారబోయకుండా తగినంత ఉప్పు, కారం వేసుకుని పోపు పెట్టుకుంటే చాలా బాగుంటాయి.

* అద్దం మరకలు పడితే ఫేస్ పౌడర్ అద్దం మీద చల్లి, కాగితంతో తుడిస్తే అద్దం కొత్తదిగా కనిపిస్తుంది.

* జలుబు చేస్తే మిరియాలు పొడిగా చేసి నేతిలో దోరగా వేపుకుని, తగినంత ఉప్పు వేసుకుని అన్నంలో కలుపుకుని తింటే జలుబు తగ్గుతుంది.

* నిమ్మరసంలో పంచదార కన్నా, ఉప్పు ఉపయోగిస్తే మంచిది.

* ప్రతీ కూరలోనూ నీళ్ళకు బదులుగా పాలు పోస్తే, రుచితోపాటు ఆరోగ్యకరం.

* అరటి పండు రోజూ ఏదో సమయంలో తినే కన్నా, రాత్రి పడుకోబోయే ముందు తింటే మంచిది.

* బీర తొక్కలు పారేయకుండా అన్ని పచ్చళ్ళు వలె పచ్చడి చేసుకుంటే బాగుంటుంది.

* చేతికి జిడ్డు అయినపుడు ముందు గుడ్డతో తుడుచుకుని, ఆపై సబ్బు పెడితే త్వరగా పోతుంది.

* స్టీలు గిన్నెలు కడిగిన తర్వాత పొడి గుడ్డతో తుడిస్తే కొత్తవిగా వుంటాయి.

* భోజనం మధ్యలో నీరు త్రాగడం కన్నా భోజనం ముగిసిన తర్వాత నీరు త్రాగితే మంచిది.

* కందిపప్పు త్వరగా ఉడకాలంటే వంటసోడా ఉపయోగించేకన్నా అరగంట ముందుగా నాన బెడితే మంచిది.

* కూరల్లో పసుపు వేయడం ఆచారం కాదు, ఆరోగ్యం.